హైడ్రా అధికారాలేంటి?

- దానికి ఉన్న చట్టబద్ధత ఏమిటి?
- ఏ అధికారంతో కూల్చివేతలు?
- చర్యలన్నీ చట్టప్రకారం ఉండాల్సిందే
- ప్రభుత్వశాఖల్లో సమన్వయమేది?
- హైకోర్టు ప్రశ్నలతో హైడ్రా ఉక్కిరిబిక్కిరి
- ఇప్పటిదాకా ఎన్ని కూల్చేశారు?
- అందుకు నిబంధనలు టించారా?
- పూర్తి వివరాలు సమర్పించండి
- ప్రభుత్వానికి న్యాయమూర్తి ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): అక్రమ కట్టడాల కూల్చివేతలో హైడ్రా తీరుపై హైకోర్టు పలు సందేహాలు లేవనెత్తింది. హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పాలని ప్రశ్నించింది. ఏ అధికారం కింద కూల్చివేత చర్యలు చేపడుతున్నారన్న వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒక ప్రభుత్వశాఖ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేస్తుంది.. మరో శాఖ ఆ స్థలంలో నిర్మాణాలకు అనుమతిస్తుంది.. ఇంకో ప్రభుత్వశాఖ వచ్చి అది అక్రమ నిర్మాణం అని కూల్చివేస్తుంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవటంతో చివరికి జనం ఇబ్బందులు పడుతున్నారంటూ తప్పుపట్టింది. ఎఫ్‌టీఎల్‌ను ధ్రువీకరిస్తూ జారీచేసిన నోటిఫికేషన్లను సమర్పించాలని అడిగితే అధికారులు ఇవ్వకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడలోని సర్వే నంబర్ 311(311/7)లోని 1,210 చదరపు గజాల్లోని 3,894 చదరపు అడుగుల ఫాంహౌస్ కూల్చివేతకు అధికారులు చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు జారీ చేయాలంటూ హైదరాబాద్‌కు చెందిన బద్వేలు ప్రదీప్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు, శంకర్‌పల్లి తహసీల్దార్, చీఫ్ ఇంజినీర్‌ను చేర్చారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి.. ఫాంహౌజ్ కూల్చివేతపై నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకోవాలని హైడ్రాకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉంటే నిబంధనల ప్రకారం నోటీసులు జారీచేసి.. చట్టప్రకారం అనుసరించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. విక్రయ దస్తావేజులు, నిర్మాణ అనుమతులు, ఇంటి పన్ను రశీదు.. మొదలైన వాటిని పరిశీలించాకే తగిన నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ఈలోగా హైడ్రా లేక ఇతర అధికారులు కూల్చివేత చర్యలకు ఉపక్రమిస్తే పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించేందుకు వెసులుబాటు కల్పించారు. ఫాంహౌస్‌కు సంబంధించి తీసుకునే చర్యలు హైడ్రా ఏర్పాటుకు చెందిన జీవో 99 ప్రకారమే ఉండాలని తేల్చిచెప్పారు. ఫాంహౌజ్ ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు ప్రాథమిక, తుది నోటిఫికేషన్ల జారీ చేసి ఉంటే అవి ఎప్పుడు జారీచేశారో.. వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 12కు వాయిదావేశారు.

రాజకీయ కుట్ర.. పిటిషనర్ వాదన

హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పాలన్న కోర్టు ఆదేశాలపై మధ్యాహ్నం తిరిగి విచారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. హైడ్రా ఏర్పాటుకు ప్రభుత్వం గత నెల జీవో 99 జారీ చేసిందని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఇతర మున్సిపాలిటీలకు హైడ్రా సమన్వయకర్తగా వ్యవహరిస్తుందని చెప్పారు. జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేస్తుందని, తదుపరి చర్యలు హైడ్రా తీసుకుంటుందని, చట్ట నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఉంటాయని వివరించారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది వీ హరిహరన్ వాదిస్తూ.. పిటిషనర్ ఫాంహౌజ్ నిర్మాణానికి 2014లో గ్రామపంచాయతీ అనుమతులు లభించాయని, ఫాంహౌజ్‌ను 2019లో పిటిషనర్ కొనుగోలు చేశారని వెల్లడించారు. ఫాంహౌజ్ పక్కనే 3.30 ఎకరాలను పిటిషనర్ కొనుగోలు చేసి ప్రహరీ గోడ నిర్మించారని తెలిపారు. హైడ్రా వెబ్‌సైట్‌లో ఫాంహౌజ్ ఉన్న భూమి (సర్వే నంబర్ 311)ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక నాయకుడికి పిటిషనర్ సన్నిహితుడు అయినందునే రాజకీయ కక్షతో, రాజకీయ దురుద్దేశాలతో ఫాంహౌజ్ కూల్చివేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని వాదించారు. గతంలో కూల్చివేత ప్రయత్నాలు జరిగాయని, దీనికి సంబంధించి ఎన్జీటీ జారీచేసిన ఉత్తర్వులను ఇదే హైకోర్టు రద్దు చేసిందని గుర్తుచేశారు. ఏఏజీ కల్పించుకుని ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలపైనే చర్యలు తీసుకుంటున్నామని, ఇదేమీ కక్షసాధింపు, వివక్షపూరితం కాదని అన్నారు. ఈ దశలో కల్పించుకున్న న్యాయమూర్తి.. ఇప్పటివరకు ఎన్ని అక్రమ కట్టడాలను గుర్తించారో, ఎన్నింటికి జీహెచ్ఎంసీ, మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారో, ఎన్నింటిపై చర్యలు తీసుకున్నారో వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

హైడ్రా విశ్వసనీయతను చాటుకోవాలి: హైకోర్టు

'హైడ్రాకు ఉన్న పరిధులు ఏమిటి? హైడ్రాకు ఉన్న అధికారాలు ఏమిటి? డబ్బు కూడబెట్టి రిజిస్ట్రేషన్ ఆఫీసులో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆపై, సంబంధిత స్థానిక సంస్థ కార్యాలయ అనుమతితో నిర్మాణం చేస్తే నోటీసులు కూడా ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారు? అక్రమ కట్టడాలైనా చట్టప్రకారం చేయాలి కదా? కూల్చివేతలకు ముందు సంబంధిత అధికారి చట్టప్రకారం భవన యజమానికి నోటీసు ఇవ్వాలి కదా? నోటీసు ఇవ్వకుండా కూల్చివేయొచ్చా? ఏ అధికారం కింద కూల్చివేస్తారు? నోటీసు ఇవ్వాలి. ఆక్రమణదారుల, అనధికార నిర్మాణదారుల హక్కుల పత్రాలను ప్రాథమిక పరిశీలన చేయాల్సిందే. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల నుంచి భవన నిర్మాణాలకు పొందిన అనుమతులతోపాటు ఆ స్థలాల రిజిస్ట్రేషన్ దస్తావేజులను కూడా పరిశీలించాలి. ఆపై, అది అక్రమమో, సక్రమమో అధికారులు తేల్చాలి. ఆ తర్వాతే కూల్చివేయాలన్న నిర్ణయానికి వచ్చినప్పుడు చట్టప్రకారం గడువు ఇచ్చి చేయాలి కదా? ఏకపక్షంగా కూల్చివేతలు చేస్తున్నారనే అభిప్రాయం ఏర్పడకుండా కూడా చేయాలి కదా? నిర్మాణాలు జరిగిన 15-20 ఏండ్ల తర్వాత హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణమని కూల్చివేయటం ఏమిటి? ఫాంహౌజ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదని ఎలా నిర్ధారణకు వచ్చారు? ఈ మేరకు ప్రాథమికంగా నోటిఫికేషన్ జారీ చేశారా? ఎప్పుడు చేశారు? ఏ నిర్ధారణకు రాకుండా కూల్చివేత చర్యలు ఎలా చేపడతారు? ఫాంహౌజ్ స్థలం రిజిస్ట్రేషన్‌కు డబ్బులు తీసుకున్నారు. పదేండ్లుగా ఇంటి పన్ను కట్టించుకున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణమని చెప్పి కూల్చేస్తామంటే ఆ వసూళ్లకు అర్థం ఏమిటి? అది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం కాదా?' అంటూ ప్రభుత్వాన్ని, హైడ్రాను హైకోర్టు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. 60-100 గజాల జాగా ఉన్నవారి విషయంలో ఒకలా, ఎకరా భూమిలోని నిర్మాణం ఉన్నవారి విషయంలో మరోలా వ్యవహరించటానికి వీల్లేదని తేల్చిచెప్పింది. కూల్చివేతల వ్యవహారంపై లోతుగా విచారణ చేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపింది. పిటిషనర్ పేర్కొన్న ఫాంహౌజ్ 2014లో నిర్మాణం జరిగిందని, అంటే పదేండ్లుగా ఆ ఫాంహౌజ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదని అధికారులకు గుర్తుకు రాలేదా? అని నిలదీసింది. జీవో99లో పేర్కొన్న నిబంధనలను హైడ్రా కచ్చితంగా అమలు చేయాలని, ఇప్పటివరకు హైడ్రా ఎన్ని కట్టడాలను కూల్చివేసింది? అన్ని కూల్చివేత చర్యల్లో చట్టనిబంధనలను అమలు చేశారా? అని ప్రశ్నించింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదేవిధంగా జన్వాడ ఫాంహౌజ్ ఎఫ్‌టీఎల్ వివరాలు కూడా సమర్పించాలని స్పష్టంచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌టీఎల్‌ను నోటిఫై చేస్తే ఆ వివరాలు కూడా అందజేయాలని వెల్లడించింది. ఇదే సమయంలో తన ఫాంహౌజ్ కూల్చివేయకుండా మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరగా, అక్రమ కట్టడాల కూల్చివేత చర్యలు అడ్డుకోబోమని, స్టే ఉత్తర్వులు జారీ చేయబోమని హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే సమయంలో హైడ్రా చర్యలన్నీ చట్టప్రకారమే ఉండాలని తేల్చిచెప్పింది.

కాంగ్రెస్ నేతల రాజభవనాలు కూల్చే దమ్ము హైడ్రాకు ఉన్నదా?

- ఎఫ్‌టీఎల్ పరిధిలోనే పాంగులేటి, కేవీపీ, గుత్తా, వివేక్, మధుయాష్కీ ఫాంహౌజ్‌లు
- సీఎం ఫాంహౌజ్ శాటిలైట్ మ్యాప్ మీడియాకు పంపిస్తా
- బీఆర్ఎస్ నేత కేటీఆర్ సవాల్

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మించిన కాంగ్రెస్ నేతల ఫాంహౌజ్‌లు కూలగొట్టే దమ్ము హైడ్రాకు ఉన్నదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మధుయాష్కీ వంటి కాంగ్రెస్ నేతలు చెరువుల ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో లేదా బఫర్ జోన్లలో నిర్మించుకున్న రాజభవనాలను కూల్చగలదా? అని నిలదీశారు. సీఎం ఫాంహౌజ్ శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తానని చెప్పారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల రాజభవనాలు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. 'ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నేత కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మధుయాష్కీ.. వీళ్లందరి ఫాంహౌజ్‌ల దగ్గరికి వెళ్లి కూలగొడదాం. వీరితోపాటు రేవంత్‌రెడ్డికి కూడా ఫాంహౌజ్ ఉన్నది. సీఎం ఫాంహౌజ్ శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తా చూసుకోండి. నా పేరు మీద ఫాంహౌజ్ ఉన్నట్టు మీడియాలో ఏవేవో కథనాలు రాస్తున్నారు. కానీ, స్పష్టంగా చెప్తున్న.. నా పేరు మీద ఏ ప్రాపర్టీ లేదు. జన్వాడలో నా స్నేహితుడి ఫాంహౌజ్‌ను లీసుకుతీసుకున్న. ఎఫ్‌టీఎల్ లేదా బఫర్‌జోన్‌లో ఉంటే నేనే దగ్గరుండి కూలగొట్టిస్తా. నో ప్రాబ్లం. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్న. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, పెద్దపెద్ద కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతేంది? నా స్నేహితుడి ఫాంహౌజ్‌ను జూమ్ పెట్టి తీస్తున్నారు. అవి సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఒక వేళ తప్పు జరిగితే దగ్గరుండి కూల్చివేయించేందుకు సహకరిస్తా. ఇక హైడ్రానో.. అమీబానో ఉంది కదా. దాన్ని తీసుకొని అక్కడి నుంచి నేరుగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫాంహౌజ్ నుంచి మొదలుపెడుదాం. వాళ్ల తమ్ముడు కూడా అక్కడే ఉన్నాడు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఫాంహౌజ్ కూడా నీళ్లలోనే కట్టారు. అన్నీ ఒక్కటే రోజు కూలగొడుదాం. ప్రజలకు పారదర్శకంగా ఉందాం. తప్పు నేనుచేసినా సరే చర్యలు తీసుకోండి. ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్నా ఎలాంటి ఇబ్బంది, అభ్యంతరం లేదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు. సమావేశంలో మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, నేతలు దాసోజు శ్రవణ్‌కుమార్, పీ విష్ణువర్ధన్‌రెడ్డి, షేక్ అబ్దుల్లా సోహైల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి ఫాంహౌస్ నాకు తెల్వదు

- కబ్జాదారులు ఎంతటివారైనా, సినిమా యాక్టరైనా చర్యలుంటయ్
- నగరంలో అమెరికా తరహా రోడ్లు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : 'మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్‌లో ఉందంటున్నరు.. అదేందో నాకు తెల్వదు' అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పెద్దలకు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయంటున్నారని, సీఎం రేవంత్‌రెడ్డికి కూడా ఫామ్‌హౌస్ ఉందంటున్నారని, అవెక్కడున్నాయో చూపించాలని ప్రశ్నించారు. సచివాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతల అంశాన్ని ప్రస్తావించారు. జీవో 111 పరిధిలో 30శాతం విస్తీర్ణంలోనే నిర్మాణాలు చేయాలని, హైడ్రా అనేది చెరువులను కబ్జా నుంచి కాపాడేందుకేనని చెప్పారు. చిన్నా పెద్దా తేడా లేకుండా చట్ట ప్రకారం అందరిపై చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ముఖ్యంగా గండిపేట్ పరివాహక ప్రాంతంలో పార్టీలకు అతీతంగా చాలా మంది ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని, కబ్జాదారులు ఎంత పెద్దవారైనా, సినిమా యాక్టరైనా చర్యలుంటాయని తెలిపారు. అక్టోబర్‌లో ట్రిపుల్ ఆర్‌కు టెండర్ల ప్రక్రియ చేపడుతామని చెప్పారు. రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ఢిల్లీ, బొంబాయిలను తలదన్నేలా ఫోర్త్‌సిటీ తయారవుతుందని, ఫోర్త్ సిటీకి మెట్రో, ఎయిర్‌పోర్టును కనెక్ట్ చేస్తామని చెప్పారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారికి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్టు వివరించారు. ఆరు లేన్ల రహదారికి దసరా నాటికి టెండర్లు పూర్తి చేసి నవంబర్ మొదటివారంలో పనులు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. నారపల్లి-ఉప్పల్ ఫ్లైఓవర్ పనులకు రెండు నెలల్లో టెండర్లు పిలిచి ఏడాదిన్నరలో పూర్తిచేస్తామని చెప్పారు. మన్నెగూడ ఎక్స్‌ప్రెస్‌వే పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. అమెరికా తరహా రోడ్లు అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్నామని, హడ్కో ద్వారా రుణం తీసుకొని గ్రామీణ రోడ్లను బాగుచేస్తామని తెలిపారు.

దుద్యాల తహసీల్దార్ కార్యాలయంను ముట్టడించి ఆందోళన చేస్తున్న రైతులు

'ఫార్మా విలేజ్'పై రైతుల రణం

దుద్యాల తహసీల్దార్ కార్యాలయం ముట్టడి • ప్రాణాలు పోయినా భూములివ్వం

బొంరాస్‌పేట, ఆగస్టు 21 : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఏకమవుతున్నారు. ఫార్మా విలేజ్‌ను అడ్డుకోవడానికి దశలవారీ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ధర్నాలు చేపట్టి, అధికారులకు వినతిపత్రాలు అందజేసిన ఆయా గ్రామాల రైతులు బుధవారం దుద్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకు ముందు పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద సమావేశమై అక్కడి నుంచి హకీంపేట మీదుగా పాదయాత్రగా దుద్యాల మండల కేంద్రానికి చేరుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. 'ఫార్మా గోబ్యాక్' అంటూ నినదించారు. ఫార్మా విలేజ్‌కు సాగు భూములిచ్చేది లేదని తెగేసి చెప్పారు. ప్రభుత్వం స్పందించకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని తగలబెడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. నిరసనలో పోలేపల్లి, హకీంపేట, లగచెర్ల, పులిచెర్లకుంట తండా రైతులు పాల్గొన్నారు.

చేతిగుర్తుకు ఓటేస్తివి.. చేతిల భూమి పోగొడ్తివి

- 'ఫార్మా విలేజ్'పై రైతులను కదిలిస్తున్న రాములు పాట
- సోషల్ మీడియాలో బాధిత రైతు సాంగ్ వైరల్

రైతు గుండెమోని రాములు

బొంరాస్‌పేట, ఆగస్టు 21 : ఫార్మా విలేజ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతుల ఆందోళనకు మద్దతుగా గుండెమోని రాములు అనే రైతు తన పాట ద్వారా సంఘీభావం ప్రకటించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామానికి చెందిన ఈయన తన పాట ద్వారా రైతుల్లో చైతన్యం నింపుతున్నాడు. ఈయన కూడా ఫార్మా విలేజ్ భూబాధితుడే. 'ఏమమ్మా సాయమ్మా.. చేతి గుర్తుకు ఓటేస్తివి చేతిల భూమి పోగొడ్తివి' అంటూ తల్లి సాయమ్మ కాంగ్రెస్‌కు ఓటేస్తే భూమి పోతున్నదని పాట రూపంలో ఆవేదన వెలిబుచ్చాడు. మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేస్తే భూములు పోగొట్టుకునే మార్పు వచ్చిందని ప్రభుత్వంపై వ్యంగాస్త్రాలు సంధించాడు రాములు. ప్రాణం పోయినా భూమి మాత్రం ఇచ్చేది లేదని, అభివృద్ధి పేరిట ప్రభుత్వం పేదల భూములు తీసుకుంటుందని, భూస్వాముల భూములు ఎందుకు తీసుకోవడం లేదని పాట ద్వారా ప్రశ్నిస్తున్నాడు. ఈ పాట ప్రస్తుతం యూట్యూబ్ చానళ్లలో వైరల్‌గా మారింది.

న్యాయవాదుల భద్రతకు చట్టం

- ప్రభుత్వాన్ని నివేదిక కోరిన కోర్టు

నాంపల్లి కోర్టులు, అగస్టు 21 (నమస్తే తెలంగాణ): న్యాయవాదుల భద్రతకు ప్రత్యేక చట్టం అవసరంపై నివేదిక సమర్పించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్‌ను బుధవారం ఆదేశించారు. న్యాయవాదులపై దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. న్యాయవాదులకు గౌరవం ఇవ్వాల్సిన పరిస్థితుల్లో వారిపై దాడులు జరుగుతున్నాయన్నారు. కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీకి సూచించారు.

న్యాయవాదిపై దాడి కేసులో నోటీసులు

కూకట్‌పల్లి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది సంతోష్ కుమార్‌పై ఈ నెల 16న బోరబండ పోలీసులు దాడి చేసినట్టు వచ్చిన కథనాలపై హైకోర్టు బుధవారం మరోసారి విచారించింది. కేసులో కౌంటర్లు దాఖలు చేయాలని సీఎస్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, పోలీసు కమిషనర్, బోరబండ్ ఎస్‌హెచ్‌వో, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌కు నోటీసులిచ్చింది.

శివారు ప్రజలకు 'హైడ్రా' దడ!

- హైడ్రా పరిధిలో 20 మున్సిపల్స్, 8 కార్పొరేషన్లు, 33 పంచాయతీలు, కంటోన్మెంట్ 61 పారిశ్రామిక వాడలు
- ఆస్తుల రక్షణ పేరుతో అడ్డగోలు కూల్చివేతలు
- ఆయా ప్రాంతాల భవన యజమానుల్లో కలవరం

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఈ పేరు వింటేనే జీహెచ్ఎంసీతోపాటు ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న పట్టణాలు, గ్రామాల ప్రజ లు ఉలిక్కి పడుతున్నారు. ఆస్తుల రక్షణ పేరు తో పెద్దపెద్ద భవనాలను కూలగొడుతుండటం తో ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల పట్టాలను మరోసారి చెక్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా శివా రు ప్రాంతాల ప్రజలు కలవరపడుతున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఇల్లు కట్టుకొనో, కొనుక్కొనో ఏండ్ల తరబడి నివాసం ఉంటున్నా ఇప్పుడు నిరాశ్రయులు కాక తప్పదా? అని ఆవేదన చెందుతున్నారు.

భవనాలు నేలమట్టం

రాష్ట్ర ప్రభుత్వం గత నెల 17న హైడ్రాను ఏర్పాటు చేస్తూ జీవో 99ని జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలు, 33 పంచాయతీలు, 61 పారిశ్రామిక వాడలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను హైడ్రాకు అప్పగించింది. జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల పరిధిలోని పార్కులు, లే అవుట్లు, ఖాళీ స్థలాలు, పరిశ్రమల శాఖ స్థలాలు, జలవనరుల స్థలాలను పరిరక్షించడం అస్సెట్ ప్రొటెక్షన్ వింగ్ బాధ్యత. ఆయా స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదులు స్వీకరించడం, విచారణ చేపట్టడం, ఆక్రమణలను అడ్డుకోవడం, చెరువులను కబ్జాల నుంచి రక్షించడం వంటి బాధ్యతలను దీనికి అప్పగించింది. ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకొని వందల భవనాలను కూలగొడుతున్న సంగతి తెలిసిందే. దీంతో ఏండ్ల కిందట వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి, ఇండ్లు కట్టుకున్నవారు ఇప్పుడు ఉలిక్కి పడుతున్నారు. తాము కొన్న స్థలం ఏదైనా ప్రభు త్వ స్థలం పరిధిలోకి వస్తుందా? అని ఒకటికి రెండుసార్లు సరిచూసుకుంటున్నారు. దశాబ్దాలుగా రియల్టర్ల నుంచి అడ్డగోలు లంచాలు తీసుకొని అధికారులు విచ్చలవిడిగా వెంచర్ల కు అనుమతులిచ్చేస్తున్నారన్న విమర్శలు ఉ న్నాయి. ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూ ముల్లో వెంచర్లు వేసినా నిస్సిగ్గుగా అనుమతు లు మంజూరు చేశారు. ఇదే అదనుగా చెరువులు, కుంటలు, పార్కుల స్థలాలను కబ్జా చేసి, మట్టి నింపి పూడ్చివేసి, వెంచర్లు వేసి అమ్మేశారు. సామాన్యులకు ఈ విషయం తెలియదు. అన్ని రకాల అనుమతులు ఉండటంతో లక్షలు పోసి స్థలాలు కొని ఇండ్లు కట్టుకున్నారు. ఇప్పుడు వారంతా భయపడుతున్నారు.

అధికారులపై చర్యల్లేవా?

'అక్రమ నిర్మాణాలు' అంటూ హైడ్రా ఆధ్వర్యంలో భవనాలను కూల్చివేస్తున్న ప్రభుత్వం, వాటికి అనుమతులిచ్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు నిబంధనలు ఎందుకు రూపొందించలేదని నిలదీస్తున్నారు. ఒక భవనాన్ని కూల్చివేసే ముందే ఆ ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చిన అన్ని విభాగాల అధికారులకు నోటీసులివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వారి నుంచి వివరణ తీసుకొని, తగిన శిక్ష విధించిన తర్వాతే భవనాలు కూల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

హైడ్రా పరిధిలోకి వచ్చేవి ఇవే

మున్సిపల్ కార్పొరేషన్లు

1. బడంగ్‌పేట (రంగారెడ్డి జిల్లా)
2. బండ్లగూడ జాగీర్ (రంగారెడ్డి జిల్లా)
3. మీర్‌పేట్- జిల్లెలగూడ (రంగారెడ్డి జిల్లా)
4. బోడుప్పల్ (మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా)
5. పీర్జాదిగూడ (మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా)
6. జవహర్‌నగర్ (మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా)
7. నిజాంపేట (మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా)
8. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

మున్సిపాలిటీలు

1. పెద్ద అంబర్‌పేట (రంగారెడ్డి జిల్లా)
2. ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి జిల్లా)
3. జల్‌పల్లి (రంగారెడ్డి జిల్లా)
4. శంషాబాద్ (రంగారెడ్డి జిల్లా)
5. తుర్కయాంజల్ (రంగారెడ్డి జిల్లా)
6. మణికొండ (రంగారెడ్డి జిల్లా)
7. నార్సింగి (రంగారెడ్డి జిల్లా)
8. ఆదిభట్ల (రంగారెడ్డి జిల్లా)
9. తుక్కుగూడ (రంగారెడ్డి జిల్లా)
10. బొల్లారం (సంగారెడ్డి జిల్లా)
11. తెల్లాపూర్ (సంగారెడ్డి జిల్లా)
12. అమీన్‌పూర్ (సంగారెడ్డి జిల్లా)
13. దమ్మాయిగూడ (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
14. నాగారం (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
15. ఘట్‌కేసర్ (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
16. గుండ్ల పోచంపల్లి (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
17. తూంకుంట (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
18. కొంపల్లి (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
19. దుండిగల్ (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)
20. పోచారం (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా)

గ్రామ పంచాయతీలు

1. రామచంద్రాపురం (మెదక్)
2. ఐలాపూర్ (మెదక్)
3. కర్దానూర్ (మెదక్)
4. కృష్టారెడ్డిపేట్ (మెదక్)
5. ముత్తంగి (మెదక్)
6. పోచారం (మెదక్)
7. సుల్తాన్‌పూర్ (మెదక్)
8. కచ్చివాని సింగారం (రంగారెడ్డి)
9. కొర్రెముల్ (రంగారెడ్డి)
10. పీర్జాదిగూడ (రంగారెడ్డి)
11. ప్రతాప్‌సింగారం (రంగారెడ్డి)
12. బాచారం (రంగారెడ్డి)
13. గౌరెల్లి (రంగారెడ్డి)
14. కుత్బుల్లాపూర్ (